# మోహన గీతం

— గుండ్రేటి



విజయనగరం బస్టాండు తాజా ముఖాలతో కోలాహలంగా ఉంది.

విశాఖపట్నం వెళ్ళమన్న ప్రయివేటుబస్సు వేగిరం రండంటూ హార్న్ కొట్టింది. అది మోహన రావుకి అలవాటయిన బస్సే! పాత మోడలు ట్రయాన్లలోని సీట్లలా ఎదురెదురు సీట్లున్నాయి.

బస్సులో జనం పొడి పొడిగా

ఉన్నారు. వెనకన ముందున సీట్లు ఒకటీ అరా ఖాళీగా ఉన్నాయ్.

ఆఫీసు కేసు నిమిత్తం విశాఖ బయలుదేరిన మోహనరావు అను వయిన సీటు కోసం అన్ని వైపులా చూశాడు. ముందు భాగంలో ఒక జూనియరు జంట కూర్చొని ఉంది. వాళ్ళ కెదురుగా సీటు కనిపించ టంతో అతని కళ్ళు తళతళ మెరి శాయి. ఆమె కెదర నున్న సీటు నాక్రమించాడు మోహనరావు.

మోహనరావు విజయనగరం సబ్ డివిజనాఫీసులో క్యాషియరుగా పని చేస్తున్నాడు. నెలకో పది సార్లన్నా డివిజనాఫీసు పనిపై విశాఖ వెళ్ళి రావడం అతనికి మామూలే. ఈ రోజొక గవర్న మెంటు కేసు నిమిత్తం కొన్ని మెజర్మెంటు బుక్కులు, అగ్రి మెంట్లు మొదలగు డాక్యుమెంట్లను ప్రభుత్వ అడ్వకేటు ద్వారా కోర్టులో సమర్పించేందుకు బయలుదేరాడు.

ప్రయాణంలో కాస్త ప్రేమా యణం లాంటిది ఉంటేనే బస్సులో వున్నంతవరకు బోరుకి దూరంగా గడప వచ్చునంటాడు మోహనరావు. అదొక్కటే అతడికి అన్నిటినీ మించిన రుచి కరమయిన టైమ్ కిల్లింగ్ బఠాణీ.

నిజానికతడు పెళ్ళిగాని వాడేం కాదు. పెళ్ళయి ఆరేళ్ళయినా పిల్లా పీచు కలగక, బాదర బందీ లేక, నీటుగా తయారయి గోటుగా తిరగ టం కాస్త అలవాటుగా కలవాడు. ఆ కళ్ళెప్పుడూ ఎక్కడైనా పంచ వన్నెల చిలుకల కోసం పరీక్షగా చూస్తుంటాయి. అందమయిన ఆకర్షణీయమైన అమ్మాయి లెదు రయితే అంతకు మించిన కాలక్షేప మెక్కడా ఉండదతడికి.

అలవాటుగా ఎదర కూర్చు న్నామె వంక పరిశీలనగా చూశాడు.

కాస్త వలుపయినా సన్నగా నాజూగ్గా ఉంది.

ఆమె భర్త అంటీ ముట్టనట్టు దూరంగా కూర్చున్నాడు. ఇంకా స్పష్టంగా చెప్పుకోవాలంటే మొగుడు పెళ్ళాల మధ్య మరో మనిషి కూర్చో గలిగేంత స్థలం మిగిలి ఉంది. ప్రక్కన భర్తున్నా ఆమె చూపంతా వచ్చిపోయే వారి పైనా, కిటికీ బయటా కేంద్రీక రించ బడి ఉంది.

ఇద్దరివంక మోహనరావు మార్చి మార్చి చూశాడు.

ఏదైనా ఒక విషయంలో మొగుడు పెళ్ళాల మధ్య మనస్పర్థ లేర్పడి ఉండవచ్చునని, ఫలితంగా ఆమె పుట్టింటికి బయలుదేరిందని అనుమానించాడు.

ఎక్కినవాళ్ళలోని యాభయి శాతం మళ్ళీ క్రిందికి దిగి తో స్తేనే గాని కదలనంది బస్సు. ఎదురయిన పాసింజర్ల నెక్కించుకుంటూ ఊరి పొలిమేరను చేరటానికి ముప్పావు గంట పట్టింది.

మోహన రావుకు చిరాక్కలి గింది.

"ఛీ....ఛీ........వెధవ బస్సు. తోపుడుంటేనేగాని కదలదు. కది లినా, చెత్తకుండీ చూస్తే అల వాటుగా ఆగిపోయే మున్సిపాలిటీ ఒంటెద్దు బండిలా ఎవరన్నా చేతి సంచీతో కనిపిస్తే చాలును- తక్కున ఆగి కూర్చుంటుంది." డ్రైవరుకి వినబడాలనే గట్టిగా అన్నాడు.

ఆమె చూపులోని మెచ్చు కోలును చూసి తెగ మురిసి పోయాడు. ఫరవాలేదిది - పిలి స్తే పలికే రకమేనని అనుకున్నాడు.

స్వంత పెళ్ళాం, అక్కలు, చెల్లెళ్ళు తదితరులు తప్పించి లోకంలోని మిగిలిన ఆడాళ్ళంతా యిట్లానే ఉండాలని మోహనరావు అభిప్రాయం. అందంగా అలంక రించుకోవాలి. ఆకర్షణీయంగా అగ పడాలి. కడవరకూ కాలక్షేపంగా విలవాలి. అప్పుడే ఈ జీవన యాత్రలో కాస్త థ్రిల్లుంటూ ఒక టుండేది అనంటాడు మోహనరావు.

మోహనరావు గోల్డుఫ్లాక్ సిగరెట్టు బయటకు తీసి అగ్గిపెట్టె కోసం ఒకక్షణం తడుముకున్నాడు. స్టయిల్గా ముట్టించి నోటినిండా పొగను దట్టించి వదిలాడు. పెదవులు దాటి వచ్చిన పొగ మృదువుగా ఆమె చెంపలను తాకి పైన వ్రాయబడి ఉన్న 'పొగతాగరాదు' అన్న అక్ష రాలను కప్పేందుకు ప్రయత్నించి, క్రమంగా బస్సంతా చెదిరి పోయింది.

సిగరెట్టు పెదవుల నడుమ తరుగుతూండగ, పాతబస్సు తాతల నడుగు తీస్తుండగ—ఆమె వంక చూస్తూ ఆలోచనల్లో ఊగిస లాడాడు మోహనరావు.

ఈ మొగుడు ముండా కొడుకు ప్రక్కనుండటంవల్ల బస్సాగినప్పు డల్లా ఆమెను 'అది కావాలాండీ! ఇది తెమ్మన్నారాండీ!' అంటూ దారి పొడుగునా అడుగుతూ మాటలు కలుపుతూ ఆమెకు చేరు వయే ఛాన్సు తనకు మిగలకుండా పోయిందని విచారించాడు.

ఎదుటవాడి పెళ్ళాం గురించి ఆలోచిస్తున్న మోహనరావుకి తన భార్యతో ప్రయాణించిన రోజులు గుర్తుకు వచ్చి క్షణంసేపు మనసుని చీకాకు పరిచాయి. మోహనరావుకి

పెళ్ళాంతో ప్రయాణం అడుగడుగున ప్రమాదం. బస్సెగితే చాలు- కవిపించిన సామగ్రిని బేరమాడ నారంభిస్తుంది. కాఫీలివ్వాలి. కిళ్ళీలు తేవాలి. మాటిమాటికి మంచి నీళ్ళు లానూ ఇవ్వాలి. జీడిపప్పు కొంటా నంటుంది. అరటిపళ్ళు కొన మంటుంది. బత్తాయిలు వగైరాలు బేరమాడుతుంటుంది. అబ్బబ్బా! అన్నీ ఖర్చులే. ప్రయాణం పొడుగునా ప్రాణం తీస్తూనే ఉంటుంది.

తమ భార్యల కోర్కెలకు విసుగును ప్రదర్శిస్తూ పరాయి స్త్రీ యేం కోరినా అదే పదివేలని పరుగులు తీసే మోహన మూర్తులు కోకొల్లలుంటారు. అట్టి వారిలో మన మోహనరావు దిట్టని ఒప్పు కొనక తప్పదు. ఎదటి చినదాని చిరుహాసానికై చచ్చేంత తాపత్ర యం పడుతుంటాడని వేరే చెప్పుకో నవసరం లేదు. కాని ఈ రోజా అవకాశం తనకు మృగ్య మయ్యింది.

"క్షమించాలి. పొగ మా మిసెస్‌కి పడదు. మరో సీటుకి పోయి కాల్చుకోండి. ప్లీజ్!" అన్నాడు ఎదురుగా కూర్చున్నామె భర్త మోహనరావుతో.

బస్సంతటికీ యిదొక్కటే తన కనువైన సీటు. ఎదటి ఆసామి ఏదో నెపంతో తనవీ సీటునుండి తరమ జూస్తున్నా డనుకున్నాడు మోహనరావు. ఆరు నూరయినా, నూరారయినా తనీ సీటుని విడిచి పెట్టేది లేదు, సిగరెట్టు తాగటమూ మానేది లేదు అని నిర్ణయించు కున్నాడు.

"చూడండి మిస్టర్! మీపేరు?"

"తాతారావు."

"అట్లాగా! చూడండి తాతగారు! ఈరోజుల్లో సిగరెట్టు తాగని మొగుణ్ణి మొగుడిగా చూడదు యే ఆడదీను. అసలీ మధ్య దిగే సిగ రెట్లుకున్న సువాసన ఏ అగర బత్తుల కుంది చెప్పండి? మీరలా సిగరెట్టు పొగను తీసి పారేయటం యేమంత బాగోలేదు. చుట్ట పొగంటే మనవంటి వారికి వెగటు గనుక పడదంటే అర్థముంది. కేవలం చుట్ట పొగ నరికట్టాలని మాత్రమే యిట్లా అన్ని చోట్ల రాస్తుం డొచ్చును" అంటూ 'పొగ త్రాగ రాదు' అన్న అక్షరాలను చూపిం చాడు మోహనరావు.

తాతారావు నోటికి తాళం పడ్డది.

మోహనరావు తను తెలివిగా సమాధాన మివ్వగలిగానని సంబర పడ్డాడు.

ఆమె భర్తవంక అదో మాది

రిగా చూసింది. ఆ చూపుకి అర్థం 'మూర్ఖునికి ఒకసారిమించి చెప్పకు' అని స్ఫురించిందేమో తాతారావు నోరు మూసుకున్నాడు. కాని మోహనరావుకి మాత్రం 'బాగా చెప్పారు- ఇక చాలా!' అని ప్రశ్నిస్తున్నట్టు స్ఫురించింది. కాలర్ సర్దుకొని చిన్నగా నవ్వుకున్నాడు.

క్రమంగా బస్సు వేగాన్ని పుంజుకుంది.

అలా స్పీడుగా నడుస్తున్న బస్సు ఒక చోట రోడ్డుని దాట బోతున్న ఆవుని తప్పించేందుకు చేసిన ప్రయత్నంలో సడన్ బ్రేకు పడి బస్సులోని కొందరు తూలి పడబోయారు.

ఆ బ్రేకే మరికాస్త సడనై య్యుంటే ఈ పాత చింతకాయ పచ్చడిగాడి పెళ్ళాం తన ఒడిలో కొచ్చి పడేదేననుకున్నాడు మోహన రావు. అట్టి సడన్ బ్రేకు వెయ్య నందుకు డ్రయివర్ని మనసులో తిట్టుకున్నాడు. అమోఘమైన అవ కాశం కొంచెంలో తప్పిపోయి నందుకు ఒక నిమిషం నొచ్చు కున్నాడు. ఆ పైన ఆమె నిజంగా తన ఒడిలో వచ్చి పడిఉంటే ఎట్లా ఉండేదోనని ఊహించుకో నారం భించాడు. అలా అలా తీయగా ఊహించుకు పోతుంటే ఎంతో హాయనిపించింది మోహనరావుకి. ఇక మరో కుదుపుకి తను సిద్ధంగా ఉండాలని అనుకున్నాడు. ఆ కుదు పులో ఆమె ఏమాత్రం ఊగిపడినా అమాంతం వాటేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నాడు.

మరొకడి భార్య తన ఒడిలోకి వచ్చిపడితే బాగున్నని తపించే మోహనరావులో- తన భార్య తను ఇంటివద్ద లేనివేళ తలుపు బిగించి ఉంటుందా లేదా అన్న భయంతో కూడిన సందేహం లేకపోలేదు. దాని క్కారణం ఎదురింట్లో కొందరు కాలేజీ కుర్రాళ్ళు మెస్సు పెట్టుకొని వుంటున్నారు. వాళ్ళదే పనిగా తన ఇంటి ముంగిట తిరుగు లాడటం, ప్రతి కదలికలో ప్రత్యేక మయిన భంగిమను చూపడం అనేకమార్లు గమనించాడు మోహన రావు. అనాటినుండీ ఇల్లు విడిస్తే అసలు యింటి విషయమే గుర్తుంచు కోని మోహనరావుకి ఇప్పుడిప్పుడే తనెక్కడున్నా ఒక్కొక్కప్పుడు ఇంటి మీద ధ్యాస మళ్ళుతూ ఉంటుంది.

ప్రస్తుతం సాటి ప్రయాణీకుడి పెళ్ళాం తన ఒడిలోకి రావాలని వాంఛించే మోహనరావు, ఒక ప్పుడు తను స్నాన గదిలోనున్న సమయంలో ఎదురింటి కుర్రాళ్ళలో

ఒకడు అగ్గిపెట్టె ఇవ్వండంటూ తలుపు తట్టిన క్షణం—తన భార్యే స్వయంగా తలుపుతీసి అగ్గిపెట్టిం చ్చిందని, అగ్గి తగిలిన ఆటం బాంబే అయ్యాడు.

తనదయినది తన ఒడిని పీడ రాదు. పరాయివాడిదయినది తన ఒడిలో పడితే ఎంత బాగు! ఇట్లాం టివి మోహనరావులాంటి వారి స్వభావాలు.

ఆమె కళ్ళలోకి చూస్తూ తీయగా ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఉన్నట్టుండి తనెంతటి మాథమెటీషియనో యేమిటో ఆమెకు చూపాలని పించిందో ఏమో—మెజర్మెంటు బుక్కుని తెరిచి కేసుకి సంబంధిం చిన బిల్డింగు యొక్క గజిబిజి కొలతలను గుణించి చూడటం మొదలుపెట్టాడు. మధ్య మధ్య ఆమెను చూపులతో పొడుస్తూ, పొగతో తడుపుతూనే ఉన్నాడు.

మోహనరావు ఆలోచనలు కొన సాగుతూ ఉండగా, నడుస్తున్న బస్సు నడిరోడ్డుపై సడన్ బ్రేకుతో ఆగింది. ఫర్లాంగు దూరంలో పొలాల గట్ల మీదుగా ఎవరో పరు గెత్తుకు రావడం త్రయివరు తప్ప మరెవరూ చూడలేదు. సడన్ బ్రేకుకి బస్సులో అన్యమనస్కంగా ఉన్న వాళ్ళంతా తూలిపడ్డారు.

ఆమె కూడా ముందుకి జోగింది.

ఇక మోహనరావు వాంఛ తీరినట్టే!

ఆమె జోగిన జోగుకి మోహన రావు ఒడినే కాదు—మెడను, ముఖాన్ని, తలను అన్నిటినీ ఆక్ర మించింది. తెరచి ఉన్న మెజ ర్మెంటు బుక్కులోని కేసుకి సంబంధించిన అసలయిన కొలత లన్నీ తడిపి ఏకమయ్యాయి.

మోహనరావుకి కళ్ళు బైర్లు క్రమ్మాయి. చూసిన వారంతా కలత జెందారు. చివాల్న లేచి నిలబడ్డాడు మోహనరావు.

"ఆమెకు పొగ పడదని మీకు ముందుగానే చెప్పాను. వినలేదు. మొదలే యిది బస్సు ప్రయాణం. దానికి తోడు పడని పొగ. కడుపు తిప్పక ఏం జేస్తుందీ?" అంటూ తుడుచుకునేందుకు తువ్వాలందిం చాడు తాతారావు.

అందరికీ దూరంగా వెనక సీటుకి పోయి తడిచిన ఒంటిని తుడుచుకుంటున్న మోహనరావుకి తుడుచుకు పోయిన మెజర్మెంటు బుక్కు పేజీలు కళ్ళబడ్డంతో ఎదుట సస్పెన్షనార్డరు లీలగా మెదిలింది.

రేపటి బ్రతుకు గీతం విషాదంగా వినిపిస్తూ, ఎక్కడ లేని పిస్ప తుపను కలిగించింది మోహనరావులో. •